



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు

# శింగనమలమల

## తొమ్మిది గ్రామాల్లో నేల రాలని చినుకు.. ఎండిపోతున్న వేరుశనగ పంట

- కీలక సమయంలో వాన కరువు
- ఈ ఏడాది నష్టాలే అంటున్న రైతులు

శింగనమల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చుట్టు పక్క ప్రాంతాల్లో వర్షం కురుస్తున్నా మండలంలోని కొన్ని గ్రామాల్లో చుక్క చినుకు నేల రాలడం లేదు. ఎండ మండుతుండటంతో ఏపుగా పెరిగిన వేరుశనగ ఎండిపోతోందని ఆయా గ్రామాల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పెద్ద మట్లగొంది, చిన్నమట్లగొంది, సోదనపల్లి, ఈస్టు నరసాపురం, సలకంచెరువు, చిలేపల్లి, కొరివిపల్లి, నాయనవారిపల్లి, నిదనవాడ గ్రామాల్లో ఖరీఫ్‌లో వర్షాధారం కింద 2వేల ఎకరాల్లో వేరుశనగసాగు చేశారు. పంట సాగు చేసిన తర్వాత వర్షాలు బాగా రావడంతో పైరు ఏపుగా పెరిగింది. పంట కళకళలాడుతుండటంతో ఈ ఏడాది దిగుబడి బాగుంటుందని, కష్టాల నుంచి గట్టెక్కవచ్చని సగటు రైతు భావించాడు. కాయలు కాసి, విత్తనం ఏర్పడే దశలో వాన మొహం చాటేసింది. చుట్టు పక్క ప్రాంతాల్లో అడపా దడపా చినుకులు పడుతున్నా ఈగ్రామాల్లో అస్సలు పడటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదును వాన కాకాపోతే విత్తనం పూర్తిగా తయారు కాదని, దీంతో కాయలు లొత్తగా మారుతాయని ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది కూడా వేలాది రూపాయల నష్టాలను మూటగట్టుకోవాల్సిందేనని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెద్దమట్లగొంది వద్ద ఎండిపోయిన వేరుశనగ పంట

### కూలీల ఖర్చు కూడా రాదు



ప్రతి సంవత్సరం మాదిరిగానే ఖరీఫ్ సీజన్‌లో 25 ఎకరాల్లో చిన్న పుష్యమి కార్తెలో వేరుశనగ విత్తనం వేశాం. మొదట్లో వర్షాలు బాగా రావడంతో పైరు ఏపుగా పెరగడంతో దిగుబడులు బాగా వస్తాయనే నమ్మకంతో పెట్టుబడులు పెట్టాం. 25 ఎకరాలకు సాగు కోసం రూ.7లక్షలుపైగా ఖర్చు చేశా. కూలీలకే దాదాపు రూ.3లక్షలు వరకు ఖర్చు చేశా.అయితే విత్తనం ఏర్పడే కీలక దశలో వాన లేక కాయలు లొత్తగా మారుతున్నాయి. పంట తొలగించినా కనీసం కూలీలకు పెట్టిన డబ్బులు కూడా వస్తాయో రావోనని భయంగా ఉంది.

-సురేంద్రయాదవ్, రైతు, పెద్దమట్లగొంది

### 20 రోజుల కిందట వాన వచ్చిఉంటే..



20 రోజుల కిందట వర్షం వచ్చి ఉంటే మా పంట పండేది. ప్రతి సంవత్సరం ఏదో ఒక కారణంతో ఖరీఫ్ వేరుశనగపంటను నష్టపోతూనే ఉన్నాం. అయినా ఆశ చావక ఈసంవత్సరం సరైన సమయంలోనే పంట సాగు చేశాం. పంట సాగు చేసిన 70 రోజుల తర్వాత కీలక సమయంలో వాన పడటం లేదు. దీంతో వేరుశనగ చెట్టుకు కాసిన నాలుగైదు కాయలు కూడా లొత్తగా మారాయి. నేను ఏడు ఎకరాల సాగుకు రూ.2లక్షల పెట్టుబడి పెట్టా. కనీసం 50వేలు అయిన వస్తుందో రాదో..?

- ఆదినారాయణ, రైతు, చిన్నమట్లగొంది

### ఇప్పుడొస్తే పొట్టైనా దక్కుతుంది



గత ఏడాది పంట దిగుబడి బాగా వచ్చి లాభాలు రావడంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో ఐదెకరాల్లో వేరుశనగ సాగు చేశాం. చిన్న పుష్యమి కార్తెలోనే విత్తనం వేశాం. అయితే పంటకు తడి అవసరమైన దశలో చినుకు నేల రాలకుండా ఉంది. ఇప్పుడు వాన వచ్చినా కనీసం వేరుశనగ పొట్టు అయినా దక్కుతుంది. వాన రాక పైరు పూర్తిగా ఎండిపోయిన దశలో గుంటక పాస్తే, పోట్టు మొత్తం నేలపాలవుతుంది.

-శివయ్య, రైతు, పెద్దమట్లగొంది

### రైతులకు న్యాయం చేయాలి



శింగనమల మండలంలో పలు ప్రాంతాల్లో వర్షం లేకపోవడంతో వేరుశనగ పంటలు పూర్తి స్థాయి ఎండిపోయాయి. చెట్టుకు కాసిన నాలుగైదు కాయలు కూడా లొత్తలుగా ఉన్నాయి. ఈ ఏడాది వేరుశనగ పంట సాగు చేసిన అన్నదాతలు తీవ్రం నష్టపోయారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎండిన పంటపై ప్రభుత్వానికి నివేదికలు పంపి, రైతులకు న్యాయం జరిగేలా చూడాలి.

-చిన్నప్పయాదవ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

### పై అధికారులకు పంపుతాం



మండలంలోని కొన్ని గ్రామాల్లో సాగు చేసిన వేరుశనగ పంట 70రోజులు తరువాత వర్షం పడలేదు. కాయలు ఊరే కీలక సమయంలో వర్షాలు రాకపోవడం పంట దిగుబడిని బాగా తగ్గించింది. ఈప్రాంతాల్లో పంట కోత ప్రయోగం చేసి, దిగుబడులు వర్షంపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతాం. ప్రభుత్వం నుంచి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం.

-అన్వేష్‌కుమార్, ఏఓ, శింగనమల



## గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య

- ఎంపీ అంబికా, ఎమ్మెల్యే శ్రావణిశ్రీ
- రూ.5.38 కోట్లతో పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ
- సిద్ధరాంపురానికి రూ.2.5 కోట్లతో బీటీ రోడ్డు

బుక్కరాయసముద్రం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక సిద్దరాంపురం రోడ్డు వద్ద రూ.5.38 కోట్లతో నిర్మిస్తున్న గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాలకు వారు భూమి పూజ చేశారు. అనంతరం బుక్కరాయసముద్రం నుంచి సిద్దరాంపురం వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నర పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం గిరిజన విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించిందన్నారు. ఐదు ఎకరాల స్థలంలో అధునాతమైన భవనాలు, వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. బుక్కరాయసముద్రం నుంచి సిద్దరాంపురం వరకు రూ. 2.20 కోట్లతో నూతన బీటీ రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. బుక్కరాయసముద్రం నుంచి గూగూడు వరకు రూ.52 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు, వైస్ చైర్మన్ శైలజ, ఎంపీపీ సునీత, టీడీపీ నాయకులు పసుపుల నారాయణరెడ్డి, రవీంద్ర, ఓబులపతి, అధికారులు పాల్గొన్నారు.

## యాప్‌తో మద్యం గుట్టు పట్టేయొచ్చు

- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

ఉరవకొండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం కల్తీదా, నాణ్యమైనదా అన్న విషయం తెలుసుకోవచ్చని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పేర్కొన్నారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. సిబ్బందితో సమీక్షించారు. అనంతరం పట్టణంలోని మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. కొనుగోలు దారులకు యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి రామ్మోహన్‌రెడ్డి, ఏఈఎస్ శ్రీరామ్, ఎక్సైజ్ సీఐ రవిచంద్ర, ఎస్ఐ వీరస్వామి పోతులయ్య పాల్గొన్నారు.



ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న అధికారులు

రాజారెడ్డి ఎక్కడ? పట్టుకుని.. వదిలేసిన పోలీసులు..? 9

9 జడ్పీ ఆవరణలో ఉత్కంఠ ఏసీబీ తనిఖీలతో ఉద్యోగుల్లో ఆందోళన

అద్దె అడగొద్దు 9
● బీఎస్ఎన్ఎల్ భవనంలో జేసీ క్యాంపు కార్యాలయం ● నెలకు రూ.70 వేలు అద్దె
● పైసా కూడా చెల్లించని దుస్థితి
● రూ.30 లక్షలు బకాయి

## ఫైల్ కదిలించేందుకు లంచం

- ఏసీబీకి దొరికిన ఆడిట్ ఉద్యోగులు

అనంతపురం క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగి నుంచి లంచం తీసుకున్న స్టేట్ ఆడిట్ ఉద్యోగి, పార్ట్ టైం ఉద్యోగిని ఏసీబీ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. జిల్లా కేంద్రంలోని రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఉద్యోగ విరమణ ఫలాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి ఆడిట్ కార్యాలయానికి వచ్చిన ఈ ఫైల్‌ను కదిలించేందుకు రూ.10 వేలు ఇవ్వాలని సీనియర్ ఆడిటర్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేనని, రూ.8 వేలు ఇస్తానని బాధితుడు రెండు రోజుల క్రితం ఒప్పందం చేసుకుని, ఏసీబీ అధికారులను సంప్రదించారు. వారి సూచన మేరకు జడ్పీ కార్యాలయంలోని ఆడిట్ విభాగానికి డబ్బులు తీసుకుని బుధవారం వెళ్లారు. సీనియర్ ఆడిటర్ లక్ష్మీనారాయణ సూచన మేరకు, కార్యాలయ ఆవరణలో పార్ట్ టైం కంటింజెంట్ ఉద్యోగి నూర్ మహమ్మద్‌కు రూ.8 వేలు ఇచ్చారు. అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు నూర్ మహమ్మద్‌ను, కార్యాలయంలో ఉన్న లక్ష్మీనారాయణను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని, అరెస్టు చేశామని ఏసీబీ అధికారులు తెలిపారు. కర్నూలు ఏసీబీ డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో సీఐలు మోహన్‌కుమార్, హమీద్ ఖాన్ తదితరులు దాడులలో పాల్గొన్నారు.



ఏసీబీకి పట్టుబడిన సీనియర్ ఆడిటర్ లక్ష్మీనారాయణ, పార్ట్ టైమ్ ఉద్యోగి నూర్ మహమ్మద్

## నిబంధనల మేరకే టపాసులు అమ్మాలి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా అధికారులు తరచూ టపాకాయల దుకాణాలను తనిఖీ చేసి ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన డీఆర్ఓ మలోలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీలో జిల్లా ఎస్పీ జగదీష్, డివిజన్ స్థాయి అధికారులు, అగ్నిమాపక, విద్యుత్ శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ నెల 20న దీపావళి పండుగ నేపథ్యంలో టపాకాయల విక్రయదారులు పాటించాల్సిన జాగ్రత్తలు, జిల్లా యంత్రాంగం చేపట్టాల్సిన పటిష్ట చర్యల గురించి కలెక్టర్ పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పోలీస్, అగ్నిమాపక, విద్యుత్ శాఖ, రెవెన్యూ డివిజనల్ అధికారులు సమన్వయంతో పండుగను విజయవంతంగా జరుపుకునేలా చూడాలన్నారు.



## పర్యావరణ పరిరక్షణా ముఖ్యమే

- కలెక్టర్ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనతోపాటు పర్యావరణ పరిరక్షణ కూడా ముఖ్యమేనని కలెక్టర్ ఆనంద్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏపీఐఐసీ పారిశ్రామిక భాగస్వామ్య డ్రైవ్ ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. నవంబరు 15 వరకు నెలరోజులపాటు జిల్లావ్యాప్తంగా చేపట్టనున్న డ్రైవ్‌ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగకుమార్, మేనేజర్ మల్లికార్జున పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్




## ఐక్య పోరాటాలే ఐద్వా బలం

- పీడిత ప్రజల పక్షాన పోరు సాగించాలి
- ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్
- ముగిసిన ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్

అనంతపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పీడిత ప్రజలను ఐక్యం చేసి పోరాటం చేయడమే ఐద్వా బలమవ్వాలని ఐద్వా జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి టీచర్ అన్నారు. నగరంలో ఈ నెల 13 నుంచి నిర్వహిస్తున్న ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలు బుధవారం ముగిశాయి. మహిళా సమస్యలపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించారు. ముగింపు కార్యక్రమంలో శ్రీమతి టీచర్ ప్రసంగించారు. దేశంలోని మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. వేతనాల్లో వివక్ష కొనసాగుతోందని, మహిళలపై హింస పెరుగుతోందని అన్నారు. ప్రభుత్వ విధానాలకు మతతత్వ పార్టీలు తోడవడంతో మహిళల హక్కులు

(మిగతా 9వ పేజీలో...)



భావోద్వేగంతో కంటతడి పెట్టిన రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శి సావిత్రి









## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబికురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన శింగనమల చెరువు ఆయకట్టు అధ్యక్షుడు గార్లదిన్నె సత్యనారాయణ వదిన గార్లదిన్నె నాగరత్నమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండా రు శ్రావణిశ్రీ, శింగనమల మార్కెట్‌యార్డు చెర్మన్ దండు శ్రీనివాసులుతో కలిసి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే టీడీపీ సీనియర్ కార్యకర్త బెస్త కృష్ణమూర్తి గుండెపోటుతో గత మంగళవారం మృతి చెందారు. ఎమ్మెల్యే అతడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నాయకులు అనిల్‌యాదవ్, నగేష్ సురేష్, వీరాంజనేయులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

## రైలు కింద పడి వృద్ధుడి మృతి

రాప్తాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసన్నాయపల్లి- జంగాలపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్యలో గల పట్టాలపై బుధవారం నార్పలకు చెందిన వృద్ధుడు లక్ష్మీనారాయణ (75) రైలు కింద పడి మృతి చెందినట్లు ధర్మవరం రైల్వే పోలీసులు తెలిపారు. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న అతను తీవ్ర మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసిందన్నారు. రిటైర్డ్ ఆర్టీసీ కండక్టర్ అయిన ఇతడికి భార్య, ఒక కూతురు ఉన్నట్లు తెలిసిందని చెప్పారు.

## త్వరలో కుడికాలువకు నీరు

రాప్తాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ అధికారులు త్వరలో పీఏబీఆర్ కుడి కాలువకు నీరు విడుదల చేయనున్నట్లు టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి తెలిపారు. మండలంలోని గొల్లపల్లి వద్ద నుంచి పీఏఈబీఆర్ కుడి కాలువలో ముళ్ల కంపల తొలగింపు, కాలువ మట్టి దారి బాగు చేసే పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో ఈ కాలువ ద్వారా బుక్కచెర్ల, యర్రగుంట, పుల్లలరేవు, గొందిరెడ్డిపల్లి, బొమ్మేపర్తి, హంపాపురం, గొల్లపల్లి, ఎం, చెర్లోపల్లి, మరూరు తదితర చెరువులకు నీరు సరఫరా అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, తెలుగు యువత రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీపీఓ శిరీష ఉద్యోగోన్నతిపై బదిలీ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): అనంత నగరపాలక సంస్థలో టీపీఓగా పనిచేస్తున్న శిరీషకు ఏసీపీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఆదోనికి బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత బుధవారం ఉత్తర్వులు జారీ చే శారు. ఆమె స్థానంలోకి పుత్తూరు మున్సిపాలిటీలో టీపీఓగా పనిచేస్తున్న నీరజాక్షి ఉద్యోగోన్నతిపై వస్తున్నారు.

## స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన అండర్-19 బాస్కెట్‌బాల్ బాలికల జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ అండర్-19 క్రికెట్, బాస్కెట్‌బాల్ జట్లను బుధవారం ఎంపిక చేశారు. స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్, ఆర్డీటీ స్టేడియంలో క్రికెట్ సెలెక్షన్స్ నిర్వహించారు. బాలుర క్రికెట్ జట్టుకు సాత్విక్, భానుప్రసాద్, శేషు, విష్ణుభరత్, కుశాల్‌సాయి, ప్రణయ్‌తేజరెడ్డి, అభిలాష్ చరణ్, సిద్ధార్థ, సంజయ్‌కుమార్, జనార్ధన్, హర్షవర్ధన్, శ్రీనాథ్, జయంత్, వరుణ్‌సాయి నాయుడు, గోవర్ధన్, అభిలాష్, బాలికల జట్టుకు హన్సిరెడ్డి, గీతికా రాయల్, అమూల్య, హర్షియాతాజ్, కీర్తన, ధారామోహన్, కార్తిక, మన్విత, మదనికా, నందిని, చరిత, యశస్విని, రిషిత, రేఖ, భూమిక, సౌమ్య ఎంపికయ్యారు. బాస్కెట్‌బాల్ బాలుర జట్టులో సంజయ్‌రెడ్డి, విజయ్, సాయిహర్ష, మహ్మద్‌కాజా, అబ్దుల్‌కరీం, హర్షవర్ధన్, షాహిద్, అఫ్రీద్, చరణ్, సాయిచరణ్, దినేష్‌కుమార్ రెడ్డి, భరత్, సాత్విక్, బాలికల జట్టులో పరిమళ, యామిని, యశస్విని, అలేఖ్య, రితిక, సాయిజ్యోత్స్న, గీత, కల్పన, స్నేహ, ఉమాలక్ష్మి, కీర్తి, హారిక చోటు దక్కించుకున్నారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సమాఖ్య జిల్లా సభ్యులు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, పీడీలు రాజశేఖర్‌రెడ్డి, వెంకటేష్, సంపత్, గౌసియా, వేణుగోపాల్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు కుంటిమద్ది విద్యార్థినులు


రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన కుంటిమద్ది విద్యార్థినులు

రామగిరి, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటిమద్ది ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి హాకీ, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం అనంతపద్మనాభులు, పీడీ చిత్రా ఓబులేసు తెలిపారు. జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహించిన అండర్-19 హాకీ, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో సత్తాచాటారన్నారు. తద్వారా లక్ష్మి, అంకిత, స్వాతి హాకీ, మోక్షిత, లక్ష్మి బేస్‌బాల్, తులసి సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఆయా విద్యార్థినులను స్కూల్ కమిటీ చైర్మన్ జగన్నాథం, ఉపాధ్యాయులు, గ్రామస్థులు బుధవారం పాఠశాలలో అభినందించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీలో నిరుద్యోగ యువతకు ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనుందని, ఇందు కోసం ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని కాలేజీ మేనేజర్ నాగేంద్ర బుధవారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలం నాలుగు నెలలు ఉంటుందన్నారు. శిక్షణలో భోజనం, వసతి సదుపాయాలు ఉచితంగా కల్పించనున్నట్లు చెప్పారు. 18 నుంచి 29 ఏళ్ల లోపు వయసు ఉండి ఇంటర్, డిగ్రీ, డిప్లమా, ఐటీఐ, బీటెక్ చదువుకున్న వారు అర్హులని తెలిపారు. 5జీ నెట్‌వర్క్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, ఎంఎస్ ఆఫీస్, స్పోకెన్ ఇంగ్లిష్, బ్రాడ్‌బాండ్ తదితర కోర్సుల పట్ల శిక్షణ ఇచ్చి అనంతరం ప్రైవేటు సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## డ్రైవర్ నేత్రాలు దానం


రెడ్‌క్రాస్ సొసైటీకి నేత్రాలను అందజేస్తున్న రామాంజి కుటుంబ సభ్యులు

నార్పల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ నిమ్మకాయల రామాంజి(50) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించడంతో ఆయన నేత్రాలను కుటుంబీకులు దానం చేశారు. పుట్టెడు దుఃఖంలోనూ ఆయన భార్య రాజేశ్వరి, కుమారుడు త్రిగుణ్ నేత్రదానానికి ముందుకొచ్చారు. ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపారు. రామాంజి నేత్రాలను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు సేకరించారు.

# వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- హెచ్‌డీసీ సమావేశంలో కలెక్టర్ ఆనంద్
- హాజరైన ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి


మాట్లాడుతున్న కలెక్టర్, ఫొటోలో ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం వైద్యం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగుల ఐపీ, ఓపీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేసి వంద శాతం ఈ-హాస్పిటల్‌గా రిజిస్టర్ చేయాలని, అదేవిధంగా వార్డుల్లోని అడ్మిషన్లు, ఆపరేషన్లను ఎన్టీఆర్ వైద్యసేవలకింద నమోదు చేయాలని ప్రభుత్వ సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్లకు కలెక్టర్ ఆనంద్ సూచించారు. స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో బుధవారం ఆయన హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌తోపాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూపొందించిన అజెండాను ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ వివరించారు. నాలుగు గంటలపాటు సాగిన సమావేశంలో అత్యధికంగా ఈ-హాస్పిటల్, ఎన్టీఆర్ వైద్యసేవలపైనే ఎక్కువ సమయం చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ-హాస్పిటల్‌లో ఓపీ, ఐపీ రిజిస్ట్రేషన్ పెంచడం ద్వారా మనం అందిస్తున్న సేవలు ప్రభుత్వానికి వెళ్తాయన్నారు. వార్డుల్లో అందిస్తున్న సేవలు, ఆపరేషన్ థియేటర్లలోని శస్త్రచికిత్సలు ఎన్టీఆర్ వైద్యసేవల కింద నమోదు చేస్తే అందుకు సంబంధించిన డబ్బులు వస్తాయని వివరించారు. అనంతరం వైద్యులు ఆస్పత్రిలోని పలు సమస్యలను కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే, ఎంపీకి వివరించారు. ఇందుకు ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాలిటీకి అవసరమైన బడ్జెట్‌ను కేటాయించేలా ప్రభుత్వం దృషికి తీసుకెళ్తామని హామీనిచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం ,హెచ్‌డీసీ కమిటీ సభ్యులు విశాల ఫెర్రర్, ఓలేటి రత్నమయ్య, నరసింహులు, రవికాంత్ రమణ, వైద్యవిద్య కళాశాల ప్రిన్సిపాల్ విజయశ్రీ, డిప్యూటీ సూపరింటెండ్ డాక్టర్ బెనడిక్ట, ఆర్ఎంఓ రామకృష్ణతోపాటు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ విభాగాధిపతులు, పరిపాలనా విభాగం అధికారులు, డీఎంహెచ్ఓ ఈబీ దేవి తదితరులు పాల్గొన్నారు.

**మా కడుపు కొట్టకండి..**

హెచ్‌డీసీ సమావేశం అనంతరం బయటకు వచ్చిన కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు డిప్యూటీ ఆర్ఎంఓ హేమలత ఎదుట పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న మమ్మల్ని పనిలో నుంచి తీసివేస్తామని నిర్వాహకులు చెబుతున్నారని, తమ కడుపు కొట్టకుండా ఆదుకోండి అంటూ వారు కన్నీటి పర్యంతమయ్యారు.

**పెద్దాస్పత్రిని సందర్శించిన కలెక్టర్**


రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం వైద్యం: కలెక్టర్ ఆనంద్ హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశానికి ముందు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్‌కెళ్లి ఆన్‌లైన్ నమోదు వివరాలను పరిశీలించారు. ఓపీ, ఐపీ వివరాలను తప్పకుండా ఆబాలో నమోదుచేయాలని సూచించారు. అక్కడి నుంచి అత్యవసర విభాగానికెళ్లి అక్కడి పరిస్థితులపై ఆరాతీశారు. ఎమర్జెన్సీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ శ్రీనివాసులు సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆర్థోవిభాగం ఓపీకెళ్లి డాక్టర్లతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఓపీలోవున్న పలువురు రోగులతో కలెక్టర్ మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు.

## ఘనంగా వెంకట శివుడు యాదవ్ జన్మదినం


శుభాకాంక్షలు తెలుపుతున్న సిమెంట్ పోలన్న, వెంకటేశ్వర్లు

అనంతపురం క్రైం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, కార్మిక సంక్షేమశాఖ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్ జన్మదిన వేడుకలను నగరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రాంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, శింగనమల ఎమ్మెల్యే బండారుశ్రావణిశ్రీ, ఇతర టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో వెంకటశివుడు యాదవ్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిదులు, నాయకులు ఆయనకు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు శ్రీధర్ చౌదరి, మదమంచి స్వరూప, దండు శ్రీనివాసులు, కురుబ నారాయణస్వామి, గంగారామ్, వడ్డే సిమెంట్ పోలన్న, వెంకటేశ్వర్లు, సరిపూటి రమణ, సుధాకర్ యాదవ్, సంఘా తేజస్విని, నెట్టెం బాలకృష్ణ, కృష్ణకుమార్, మున్వర్, నారాయణ స్వామి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే..

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్

అనంతపురంరూరల్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ సూచించారు. మండలంలోని కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాష్ డేను నిర్వహించా రు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. తరచూ చేతులను శుభ్రంగా కడుక్కోవడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. చేతులు శుభ్రంగా లేకపోతే దానికి ఉండే క్రిములు, బ్యాక్టీరియా, వైరస్ మనం తీసుకునే ఆహారం ద్వారా శరీరంలోకి వెళ్తాయన్నారు. దీనివలన తీవ్ర ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. అనంతరం శుభ్రతపై విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీధర్, ఎంఈడీఓ దివాకర్, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు, ఎంఈఓ వెంకటస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరికుమార్, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున, సర్పంచ్ ప్రశాంత్, సాగునీటి సంఘం అధ్యక్షుడు పోతులయ్య, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెద్దన్న, నాయకులు పాల్గొన్నారు.

## 19న డ్యాన్స్, స్పోర్ట్స్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19వతేదీన అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి నృత్య క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పట్నం శివప్రసాద్, ధనుంజయలు తెలిపారు. భరతనాట్యం, కూచిపూడి, జానపద గిరిజన సంప్రదాయ నృత్యాలలో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల వారు ఆధార్‌కార్డు, జనన ధృవీకరణపత్రాలు, అసోసియేషన్ గుర్తింపు కార్డులతో ఈనెల 18వతేదీలోపు 8328686059ను సంప్రదించి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

## చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు: జడ్పీ సీఈఓ

అనంతపురంరూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయొద్దని జడ్పీ సీఈఓ శివశంకర్ పారిశుధ్య కార్మికులకు సూచించారు. కందుకూరు గ్రామంలో బుధవారం ఆయన మండల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటా జరుగుతున్న చెత్త సేకరణపై గ్రామస్థులతో ఆరా తీశారు. చెత్తసేకరణలో నిర్లక్ష్యం వహించరాదని పారిశుధ్య కార్మికులకు సూచించారు. అనంతరం సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ దివాకర్, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున పాల్గొన్నారు.

## పీవీకేకే అధ్యాపకురాలికి అవార్డు


అధ్యాపకురాలిని అభినందిస్తున్న పల్లె కిశోర్ రెడ్డి

అనంతపురం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకురాలు సివీణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. రెండు రోజుల కిందట విజయవాడలోని ఓ హోటల్‌లో సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో సెల్యూట్ ఇంటర్‌నేషనల్ అవార్డు-2025 ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో మినిస్ట్రీఆఫ్ ఎడ్యుకేషన్ సీఈఓ, ఏఐసీటీఈ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ డా. బుద్ధ చంద్రశేఖర్ చేతుల మీదుగా అధ్యాపకురాలు వీణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారన్నారు. ఈసందర్భంగా బుధవారం ఆమెను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ రెడ్డి, ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ దీప్తిజోర్దాన, డీన్ సంతోష్‌కుమార్‌రెడ్డి, ఏఓ మనోహర్ రెడ్డి అభినందించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఆమె విశిష్ట సేవలు అందించినందుకు గాను ఈ అవార్డు లభించినట్లు తెలిపారు.

## బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడి సతీమణి మృతి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే దగ్గుపాటి


భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్


అనంతపురంరూరల్, అనంతపురం 15 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ బలిజ మహాసంఘం జిల్లా అధ్యక్షుడు శంకరయ్య సతీమణి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు తొండపునాటి రమేష్ తల్లి అనూరాధ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ బుధవారం వారి ఇంటికి వెళ్లి ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## మస్తాన్‌కు ఘన సన్మానం


మస్తాన్‌ను సత్కరిస్తున్న బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారి తదితరులు

అనంతపురం విద్య, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ హాస్టల్ వార్డెన్ మస్తాన్ ఏబీసీ డబ్ల్యూఓగా ఉద్యోగోన్నతి పొంది ఉరవకొండ డివిజన్‌కు నియమితులయ్యారు. ఇందుకు బుధవారం ఆయనకు బీసీ సంక్షేమ హాస్టళ్ల అధికారులు, వెనుకబడినసంక్షేమ తరగతులు సహాయఅధికారులు నగరంలోని బీసీస్టడీసర్కిల్లో సన్మానం చేశారు. వార్డెన్ల సంఘం అధ్యక్షుడు అశ్వర్థ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీవెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి, సంక్షేమ తరగతుల సహాయఅధికారులు సుభాషిణి, రంగమ్మ, ఎస్సీవెల్ఫేర్ ఏఎస్‌డబ్ల్యూఓ రామూనాయక్‌తోపాటు బీసీహాస్టళ్ల వార్డెన్ల సంఘంనేతలు పాల్గొని మస్తాన్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఇప్పటి వరకు హాస్టల్ వార్డెన్‌గా ఆయన చేసిన సేవల్ని కొనియాడారు. జిల్లాలోని బీసీహాస్టళ్ల వార్డెన్లు పాల్గొన్నారు.

# ఏపీజే అబ్దుల్ కలాంకు ఘన నివాళులు


జడ్పీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భారత అణుశాస్త్ర పితామహుడు, మాజీరాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో గల సమావేశ భవనంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలాం చిత్రపటానికి జడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రతిఒక్కరూ ఆయన అడుగుజాడల్లో పయనించాలని సూచించారు.

● అనంతపురం రూరల్: ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను స్థానిక జేఎన్‌టీయూఏలోని అడ్మిస్ట్రేషన్ భవన్‌లో, ఇంజనీరింగ్ కళాశాలలో, ఓటీపీఆర్ఐలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్‌డీ టూ వీసీ ఆచార్య దేవన్న, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ సుబ్బారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం నిరుపేద కుటుంబం నుంచి వచ్చి భారత రాష్ట్రపతిగా ఎదిగారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్లు భానుమూర్తి, ఈశ్వర్‌రెడ్డి, వైశాలిఘొర్పడే, పద్మసువర్ణ, కిరణ్మయి, దుర్గాప్రసాద్, సుజాత, చిత్ర, ప్రశాంతి, శివకుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ వెంకటశివారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర రామశేఖరరెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ గోపీనాథ్, డిప్యూటి రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, రెక్టార్ వెంకటనాయుడు, యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఫార్మసీ ప్రిన్సిపాల్ సోమశేఖర్ తదితరులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫార్మసీ డైరెక్టర్ వెంకటరమణ, పరీక్షల విభాగం కంట్రోలర్ శ్రీరాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పంపనూరు ఆలయ అభివృద్ధికి కృషి

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత


ఆలయ జీర్ణోద్ధరణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం క్రైం/ఆత్మకూరు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. తన వంతుగా సహకరం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆమెను ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, ఇతర అధికారులు కలిశారు. ఆలయ పునర్నిర్మాణం, ఇతర అంశాలపై ఎమ్మెల్యే వారితో చర్చించారు. ఆలయ నిర్మాణానికి రూ. 12 కోట్లు వ్యయం అవుతుందని వివరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ఎంత నిధులు వస్తాయి, కామన్ గుడ్ ఫండ్ నుంచి ఎంత నిధులు తీసుకోవాలన్న అంశాలు గురించి చర్చించారు. దీనిపై త్వరలోనే టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలుద్దామని ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ నిర్మాణానికి నిధులు తెప్పించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దేవాదాయ శాఖ డీఈ శ్రీనివాసులు, ఈఓ బాబు,ఆలయప్రధాన అర్చకుడు రాముస్వామి పాల్గొన్నారు.

**పేదల ఇళ్ల నిర్మాణంలో అవినీతికి తావులేదు..**

కనగానపల్లి: పేదల ఇళ్ల నిర్మాణాల్లో ఎటువంటి అవినీతికి తావులేకుండా చూడాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆమె మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఇళ్ల బిల్లుల చెల్లింపుపై ఆరా తీశారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాదిరి బిల్లులు చెల్లింపుల్లో అవినీతి తావులేకుండా పనిచేయాలని అధికారులకు సూచించారు. అనంతరం సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనిల్‌కుమార్, తహసీల్దార్ ప్రసాద్, వీఆర్ఓలు, పంచాయతీ, హౌసింగ్, వ్యవసాయ శాఖ అధికారులతో పాటు మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ చౌదరి, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, ప్రధాన కార్యదర్శి పతకమూరి అంజి, సర్పంచ్‌లు సోమర చంద్రశేఖర్, అంకే రామక్రిష్ణ, రాజాక్రిష్ణ, బిల్లే దాము, రామాంజి, తెలుగు యువత బట్టా సురేష్‌చౌదరి, ఎంపీటీసీలు బిల్లే భాస్కర్, శ్రీరాములు పాల్గొన్నారు.

## బస్సుయాత్ర పోస్టర్ల విడుదల

అనంతపురం విద్య, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర చేపడుతున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయిస్వామి పేర్కొన్నారు. నగరంలోని సీపీఐజిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన బస్సుయాత్ర పోస్టర్లను విడుదలచేశారు. అనంతరం మాట్లాడుతూ యాత్ర ఈనెల 22న ఇచ్ఛాపురంలో మొదలై నవంబరు 12న అనంతపురంలో ముగుస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు హనుమంతురాయుడు, నాయకులు పాల్గొన్నారు.

## సర్వీస్ టీచర్లకు టెట్ సరికాదు: ఎస్టీయూ

అనంతపురం విద్య, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇప్పటికే ఉపాధ్యాయవృత్తిలో కొనసాగుతున్న సర్వీస్ సీనియర్‌టీచర్లకు టెట్ పరీక్ష తప్పనిసరిగా ఉత్తీర్ణతకావాలనే నిబంధన సరికాదని ఎస్టీయూ జిల్లా నేతలు మండిపడ్డారు. నగరంలోని జిల్లాకార్యాలయంలో బుధవారం వారు కార్యవర్గసమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి ప్రధానకార్యదర్శి రామాంజినేయులు మాట్లాడుతూ రెండు దశాబ్దా లకు పైగానే పనిచేస్తున్న టీచర్లకు పదోన్నతులు పొందాలంటే టెట్ పాస్ తప్పనిసరి అనడం సమంజం కాదన్నారు. ఇప్పటికే దేవవ్యాప్తంగా ఈనిబంధన సీనియర్‌టీచర్లలో ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ నిబంధనలు తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సూర్యుడు, రాజశేఖర్, సురేష్, శివయ్యాచారి, మల్లికార్జున పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణ దుర్మార్గం: వైసీపీ

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పీపీపీ పేరుతో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తుండడం దుర్మార్గమని, ఇది పేదలకు వైద్య విద్యను దూరం చేయడానికేనని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ శ్రేణులు నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. తొలి సంతకం చేసిన అనంతవెంకటరామిరెడ్డి మాట్లాడారు. చంద్రబాబు విజనరీ పేరుతో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ పరం చేస్తున్నారన్నారు. ఈ నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు పేదలకు వైద్య విద్య దూరమవుతుందన్నారు. వైద్యం కూడా ప్రజలకు అందదన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు జగదీష్ సంతకం చేసి మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసే ఆలోచనను చంద్రబాబు విరమించుకోవాలని కోరారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈ పంట నమోదును వేగవంతం చేయండి

గార్లదిన్నె, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ-పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ సిబ్బందికి సూచించారు. మండలంలోని కమలాపురంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది చేస్తు న్న ఈ పంట నమోదును బుధవారం వారు తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ... ఖరీఫ్ లో రైతులు సాగుచేసిన వరి, మొక్కజొన్న తదితర పంటలను ఈ పంట నమోదు చేయాలని రైతుసేవా కేంద్రం సిబ్బందికి సూచించారు. ఈ నెల 25లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, ఆర్ఎస్‌కే సిబ్బంది అనూష, శశిధర్, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాప్తాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు రాప్తాడు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అంజలీదేవి, పీడీ మల్లికార్జున తెలిపారు. బేస్‌బాల్‌లో రాఘవేంద్ర, యామిని, సాఫ్ట్‌బాల్‌లో శశికళ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభచూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరిని బుధవారం ఉపాధ్యాయులు అభినందించారు.

## లా కళాశాలలో గ్రంథాలయం ప్రారంభం

అనంతపురం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని లా కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ మహమ్మద్ గౌస్ మెమోరియల్ లైబ్రరీని వైస్ చాన్సలర్ అనిత బుధవారం ప్రారంభించా రు. ముందుగా రిజిస్ట్రార్ రమేష్‌బాబు తదితరులతో కలిసి కేక్‌కట్ చేశారు. అఅనంతరం లైబ్రరీని ప్రా రంభించారు. ఈ సందర్భంగా లా విభాగం ఫౌండర్ ప్రొఫెసర్ మహమ్మద్ గౌస్ చిత్రపటానికి నివాళులర్పించారు. వర్సిటీ వైస్ ప్రిన్సిపాల్ మునినారాయణప్ప, లా కళాశాల కో ఆర్డినేటర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


ప్రొఫెసర్ మహమ్మద్ గౌస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్




పుట్టపర్తిలో జేసీ క్యాంపు ఆఫీస్‌కు కేటాయించిన బీఎస్ఎన్ఎల్ భవనం

# అద్దె అడగొద్దు..

బీఎస్ఎన్ఎల్ భవనంలో జేసీ క్యాంపు కార్యాలయం

- నెలకు రూ.70 వేలు అద్దె
- పైసా కూడా చెల్లించని దుస్థితి
- రూ.30 లక్షలు బకాయి

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్‌కు ఉమ్మడి జిల్లా యంత్రాంగం పడ్డ బాకీలు ఇప్పట్లో చెల్లించేలా కనిపించడం లేదు. బీఎస్ఎన్ఎల్ లైవ్ టెలీకాస్ట్‌ల బిల్లులు రూ.40 లక్షల వరకూ పెండింగ్‌లో ఉన్నాయి. నేటికీ వాటి ఊసేలేదు. అనంత జిల్లా విభజన సమయంలో కేటాయించిన భవనాల విషయంలోనూ అద్దెల రూపంలో మరో రూ.30 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. 2022లో శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు సమయంలో పుట్టపర్తిలో ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు కేటాయించారు. అదే సమయంలో పుట్టపర్తిలో ఉన్న బీఎస్ఎన్ఎల్ భవనాన్ని ఆ జిల్లా జేసీ క్యాంపు కార్యాలయం, నివాసం కోసం వినియోగించుకునేందుకు అప్పటి కలెక్టర్, జేసీ.. ఆ సంస్థ అధికారులను సంప్రదించారు. ఆ భవనం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నా.. కలెక్టర్, జేసీ స్థాయి అధికారులు అడగడంతో అప్పట్లో అనుమతులిచ్చినట్లు సమాచారం. బిల్డింగ్ రెనోవేషన్ బాధ్యతలు జిల్లా యంత్రాంగమే భరించుకోవాల్సి ఉంటుందని చెప్పినట్లు సమాచారం. ఆ మేరకు రెనోవేషన్ తరువాత సంబంధిత ఇంజనీర్లతో ఎస్టిమేషన్ వేయించి నెలకు రూ.70 వేలు చొప్పున అద్దె చెల్లించేలా ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకూ ఆ అద్దె సొమ్ము రూపాయి కూడా బీఎస్ఎన్ఎల్‌కు చెల్లించలేదని అధికారుల ద్వారా అందిన సమాచారం. పలుమార్లు అద్దె అడిగినా కలెక్టర్, జేసీ, ఆర్డీఓస్థాయి అధికారులు.. పైస్థాయి నిధులు రాలేదని చెప్పుకొస్తుండటంతో నిస్సహాయస్థితిలో బీఎస్ఎన్ఎల్ అధికారులు ఉండిపోయారు. ఈ క్రమంలోనే సంస్థ రాష్ట్ర, కేంద్రస్థాయి అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు బీఎస్ఎన్ఎల్ వర్గాల సమాచారం.

### ఇంతవరకూ అద్దె చెల్లించలేదు..



పుట్టపర్తిలో జేసీ క్యాంపు కార్యాలయం, రెసిడెన్సీ భవనం అద్దె చెల్లింపు విషయంలో జిల్లా యంత్రాంగం నుంచి స్పందన లేదు. పలుమార్లు అద్దె బకాయిలు చెల్లించాలని అప్పటి కలెక్టర్, జేసీలను కోరాం. వారి నుంచి స్పందన లేకపోగా... ఫండింగ్ వస్తే ఇస్తామని చెప్పుకొచ్చారు. రూ.30 లక్షల వరకూ అద్దె చెల్లించాల్సి ఉంది. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించాం.

– ముజీబ్‌పాషా, పీజీఎం, బీఎస్ఎన్ఎల్

# పునరుత్పత్తిపై దృష్టి సారించాలి

- పశు సంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్



మాట్లాడుతున్న జేడీ ప్రేమ్‌చంద్

అనంతపురం అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువుల పునరుత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రేమ్‌చంద్ ఆదేశించారు బుధవారం స్థానిక డీడీ కార్యాలయంలో డీడీలు రమేష్‌రెడ్డి, నాగలింగేశ్వరరెడ్డి, పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి వెంకటేష్‌తో కలిసి ఏడీలు, వెటర్నరీ డాక్టర్లతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వెటర్నరీ డాక్టర్ తమ పరిధిలోని ఒక మోడల్ గ్రామాన్ని ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేసి, గొడ్డుమోతు పశువులకు చికిత్స అందించడం ద్వారా ఉత్పత్తిని పెంచాలని అన్నారు. పశువుల ఆసుపత్రుల్లో సమయపాలన ఖచ్చితంగా పాటించాలన్నారు. తాను ఆకస్మికంగా తనిఖీలకు వస్తానని, ఎక్కడ పొరపాట్లకు ఆస్కారం ఇచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని అన్నారు. పశుపోషకులకు నిత్యం అందుబాటులో ఉంటూ వ్యాధి నివారణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పాడి పశువులు, మూగ జీవాలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు.



# జడ్పీలో సందడి..!

**ఉద్యోగోన్నతికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్**

**ఏసీఆర్ సమర్పణకు సీనియర్ అసిస్టెంట్ల క్యూ**



ఏసీఆర్ ఇవ్వడానికి వచ్చిన సీనియర్ అసిస్టెంట్లు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం సందడి వాతావరణం కనిపించింది. పలు మండలాల నుంచి సీనియర్ అసిస్టెంట్లు బుధవారం క్యూ కట్టారు. కూటమి ప్రభుత్వం సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బుధవారం డెడ్‌లైన్ పెట్టి సిబ్బందికి సంబంధించిన ఏసీఆర్ (యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్) కమిషనర్ కార్యాలయానికి పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో జిల్లాలోని అర్హులైన సీనియర్ అసిస్టెంట్లకు సమాచారం ఇచ్చి ఏసీఆర్ సేకరించడంలో జడ్పీ ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. జడ్పీ కార్యాలయంలోని పరిపాలన విభాగంలో ఏసీఆర్ ఇవ్వడానికి వచ్చిన సీనియర్ అసిస్టెంట్లతో సందడి వాతావరణం కనిపించింది. సంబంధిత గుమస్తాలు, అనంతరం డిప్యూటీ సీఈఓ తనిఖీ చేయించుకొని కమిషనర్ కార్యాలయానికి పంపడానికి చర్యలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలోని 63 మండలాలకు 63 మంది మండల గ్రామ, వార్డు సచివాలయ అధికారిని నియమించడంలో భాగంగా అర్హత కలిగిన సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించి, అనంతరం ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి ఉమ్మడి జిల్లాలో డిప్యూటీ ఎంపీడీఓ స్థానాలు ఖాళీ లేవు. ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న స్థానాలకు సంబంధించి ఇప్పటికే అనంతపురం 4, సత్యసాయిలో 11 మందికి సంబంధించి ఉద్యోగోన్నతి ఉత్తర్వులు కమిషనర్ కార్యాలయం నుంచి ఇప్పటికే వచ్చాయి. ప్లేస్‌మెంట్స్ కోసం ఫైల్ కలెక్టర్‌కు పంపారు. అనుమతి వచ్చిన వెంటనే స్థానాలు కేటాయిస్తే.. ప్రతి మండలానికి డిప్యూటీ ఎంపీడీఓలను భర్తీ చేసినట్లు అవుతుంది. మండల గ్రామ, వార్డు సచివాలయ అధికారుల నియామకంలో అదృష్టం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

## గల్లంతైన వ్యక్తి మృతి

కనగానపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువలో రెండురోజుల క్రితం గల్లంతైన వ్యక్తి తల్లిమడుగుల గ్రామ సమీపంలో బుధవారం శవమై తేలాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామానికి చెందిన నాగభూషణం సోమవారం పంపనూరు సమీపాన హంద్రీనీవా కాలువలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం తల్లిమడుగుల కాలువలో శవం తేలాడుతున్న విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బయటికి తీసి విచారించగా నాగభూషణంగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రాజారెడ్డి ఎక్కడ?

**పట్టుకుని.. వదిలేసిన పోలీసులు..?**

యల్లనూరు/పుట్లూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేసిన రాజారెడ్డి పోలీసుల అదుపులో ఉన్నాడా..? పరారీలో ఉన్నాడా అనే చర్చ జరుగుతోంది. యల్లనూరు మండలం గొడ్డుమర్రి గ్రామానికి చెందిన రాజారెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని అనంతపురం, నంద్యాల జిల్లాలు, తెలంగాణలో పలువురి నుంచి రూ.2.50 లక్షలు చొప్పున వసూలు చేశాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు యల్లనూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సుమారు రూ.60 కోట్ల వరకూ ఆయన లావాదేవీలు జరిగినట్లు సమాచారం. బాధితులో ఒకరైన హరికృష్ణ ఫిర్యాదు మేరకు రాజారెడ్డిని ఇటీవల అదుపులోకి తీసుకుని విచారించారు. కానీ ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. నిందితుడిని ఇంతవరకూ అరెస్టు చూపకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఓ వైసీపీ నాయకుడి మధ్యవర్తిత్వంతో అతన్ని వదిలేశారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో బాధితుల నుంచి, ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి రావడంతో పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. పులివెందుల, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో పోలీసులు గాలిస్తున్నారని సమాచారం.

# జడ్పీ ఆవరణలో ఉత్కంఠ

**ఏసీబీ తనిఖీలతో ఉద్యోగుల్లో ఆందోళన**

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): జడ్పీ ఆవరణలోని జిల్లా ఆడిట్ విభాగంలో ఏసీబీ అధికారుల తనిఖీలతో బుధవారం సాయంత్రం తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ తనిఖీలతో జడ్పీలోని సిబ్బంది, అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఆడిట్ విభాగంలో సీనియర్ ఆడిట్ అధికారి లక్ష్మీనారాయణ రూ.8 వేలు లంచం తీసుకుంటూ పట్టు పడ్డారన్న సమాచారం బయటకు పొక్కగానే కార్యాలయంలో సిబ్బంది, అధికారులు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి వెళ్లిపోయారు. జిల్లా కేంద్రంలోని రాజేంద్రమున్సిపల్ హైస్కూల్‌లో సీనియర్ అసిస్టెంటుగా పని చేసే శ్రీనివాసులు ఈ ఏడాది మే 31న ఉద్యోగ విరమణ పొందారు. విధుల్లో ఉండగానే ఆయన ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడినట్లు సమాచారం. ఈక్రమంలో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. సెలవుల బిల్లులు, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందించడానికి ఆడిట్ అధికారులు ముడుపులు అడగడంతో శ్రీనివాసులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో బుధవారం సాయంత్రం ఆడిట్ అధికారి అడిగిన విధంగానే రూ.8 వేలు లంచం ఇస్తుండగా కర్నూలు ఏసీబీ డీఎస్పీ సోమన్న, సీఐలు మోహన్‌కుమార్, హమీద్‌ఖాన్ ఆధ్వర్యంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో జిల్లా పరిషత్ ఆవరణంలోని సిబ్బంది, అధికారులు ఉలిక్కిపడ్డారు. మనకు వచ్చిన తలనొప్పి ఎందుకని కార్యాలయ సమయం పూర్తి కావడంతో ఎవరి దారిన వారు మెల్లిగా వెళ్లిపోయారు.

# ఐక్య పోరాటాలే ఐద్వా బలం




ఐద్వా రాష్ట్ర నూతన కమిటీ

(7వ పేజీ తరువాయి)

హరించే పరిస్థితులు నెలకొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

### రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఐద్వా సమావేశాలలో చివరి రోజు రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో 57 మందికి చోటు కల్పించారు. రాష్ట్ర అధ్యక్షురాలిగా శ్రీదేవి, కార్యదర్శిగా సావిత్రి, కోశాధికారిగా శ్రీనివాస కుమారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రమాదేవి, ప్రభావతి ఎన్నికయ్యారు. సీహెచ్ రమణి, వై.సత్యవతి, షేక్ మస్తాన్‌బీ, పూర్ణ, సరోజ, రమాదేవి, సాయిలక్ష్మి, శ్యామల, చంద్రిక కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నికయ్యారు.

**రాష్ట్ర కమిటీ సభ్యులు:** పి.రమణమ్మ, బి.లక్ష్మి, ఎస్.హైమావతి, ఎస్.కుమార్, ఆర్ఎస్ మాధవి, కొండమ్మ, డి.డి. వరలక్ష్మి, భూలక్ష్మి, డి.ఆదిలక్ష్మి, దైవకృప, ఐ.పద్మావతి, శ్రీదేవి, ఉదయకుమార్, కేతా పద్మజ, శ్యామల, సరోజ, కుమారి, అరుణ, పద్మ, రజని, అనూష, రమాదేవి, షమ్మీ, శివకుమారి, షేక్ మున్వర్, ఈశ్వరి, ముంతాజ్, అలివేలు, అరుణ, పద్మ, శ్యామల, అశ్విని, జ్యోతి, శ్రావణి, అమలశ్రీ, శ్రీదేవిని రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నారు. రాజమండ్రి, అన్నమయ్య, కృష్ణా జిల్లాల మహాసభలు నిర్వహించిన తర్వాత, ఆ జిల్లాల సభ్యులను రాష్ట్ర కమిటీలోకి తీసుకుంటారు.

### సావిత్రి భావోద్వేగం

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సావిత్రి భావోద్వేగానికి గురయ్యారు. ఐద్వా ద్వారా దశాబ్దాలుగా మహిళల సమస్యలపై చేసిన విస్తృత పోరాటాలను గుర్తించి రాష్ట్ర, జాతీయ ప్రతినిధులు తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారని అన్నారు. సాధారణ కార్యకర్త నుంచి ఇప్పటిదాకా చేసిన పోరాటాలు, ఉద్యమాలను గుర్తు చేసుకుంటూ కంటతడి పెట్టారు.

### పది తీర్మానాలు

మూడురోజులపాటు జరిగిన ఐద్వా రాష్ట్ర మహాసభల్లో పది అంశాలపై తీర్మానాలు చేశారు.

- మైక్రో ఫైనాన్స్ సంస్థల దోపిడీ నుంచి కుటుంబాలను కాపాడాలి. ఆ సంస్థలు ప్రభుత్వ నియంత్రణ ఉండాలి, వడ్డే రేట్లు తగ్గించాలి.
- డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. బ్యాంకు ప్రాసెసింగ్ చార్జీలను గ్రూపు మహిళలకు మినహాయించాలి. డ్వాక్రా సంఘాల్లో అవినీతిని అరికట్టే చర్యలు చేపట్టాలి.
- మహిళలపై సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌ను అరికట్టాలి. అందుకు పటిష్టమైన చట్టం చేయాలి.
- ఎన్నికలలో సూపర్ సిక్స్ అమలు చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలి.
- జీఓ నంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలి.
- విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలి. వ్యూహాత్మక అమ్మకం నిర్ణయాన్ని రద్దు చేయాలి.
- మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలి. మద్యం, మత్తు మందులను నియంత్రించాలి.
- నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి. 14 రకాల సరుకులు చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేయాలి.
- హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలి.
- అనంతపురం ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏని పునరుద్ధరించాలి.

# హైటెక్ సిటీతో హైదరాబాద్.. గూగుల్‌తో విశాఖ అభివృద్ధి

**రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత**

**గూగుల్ సంస్థ విశాఖకు రాకపై హర్షం**



అనంతపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): హైటెక్ సిటీతో నాడు హైదరాబాద్... గూగుల్‌తో నేడు విశాఖ అభివృద్ధి చెందుతుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దార్శనికతకు ఇదొక నిదర్శనమన్నారు. బుధవారం ఎమ్మెల్యే పరిటాల సునీత తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ తీసుకొచ్చి హైటెక్ సిటీగా రూపకల్పన చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం వైజాగ్‌కు గూగుల్ సంస్థను తీసుకొచ్చి మరోసారి తన ముందుచూపు, దార్శనికతను చాటుకున్నారన్నారు. ప్రతిష్టాత్మక సంస్థ గూగుల్ విశాఖలో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. గిగావాట్ సామర్థ్యంతో గూగుల్ సంస్థ విశాఖలో ఏఐ హబ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా రానున్న ఐదేళ్లలో 1.33 లక్షల కోట్ల పెట్టుబడులను పెట్టనుందన్నారు. తద్వారా అమెరికా తరువాత ప్రపంచంలోనే ఆ సంస్థ నిర్మించే అతిపెద్ద ఏఐ హబ్‌గా విశాఖపట్నం యూనిట్ నిలుస్తుందన్నారు. 2 లక్షల మందికి ఉపాధి కల్పించే 1.33 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కృషి అభినందనీయమన్నారు. ప్రతి కుటుంబానికి కృత్రిమ మేధ ఫలాలను చేరువ చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన లక్ష్యమన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రం సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ముందుందన్నారు. భావితరాల కోసం వీరు చేస్తున్న కృషి ఎంతో ఉందన్నారు. రానున్న మూడున్నరేళ్లలో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వస్తాయన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తారని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆశాభావం వ్యక్తం చేశారు.

# సీమను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలి

**కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్**



మాట్లాడుతున్న కుంచం వెంకటసుబ్బారెడ్డి

అనంతపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని, లేదంటే కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించాలని రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మద్రాసు రాష్ట్రంలో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, వేలూరు, కృష్ణగిరి, బళ్లారి, రాయచూరు, చిత్రదుర్గ కోలార్‌తో కలిపి 12 జిల్లాలతో ప్రత్యేక రాయలసీమ ప్రాంతంగా 1951లో తీర్మానం చేశారని ఆయన గుర్తు చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3ను అనుసరించి 12 జిల్లాలతో కలిపి రాయలసీమను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్లమెంటులో తీర్మానం చేయాలని, ఈ ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవించాలని అన్నారు. ఆ దిశగా రాయలసీమ పాలకులు ప్రధాని మోదీపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కొత్త రాష్ట్ర ఏర్పాటు, ప్రస్తుత రాష్ట్రాలు, ప్రాంతాలలో మార్పులు, చేర్పులు, సరిహద్దులలో మార్పులు, పేర్లలో మార్పులు చేసేందుకు ఎవరికి అధికారం ఉందో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 వివరిస్తుందని అన్నారు. కోస్తాంధ్ర, తెలంగాణ కంటే రాయలసీమ ప్రాంతం చాలా వెనుకబడి ఉందని, రాష్ట్ర విభజన కోసం వేసిన శ్రీకృష్ణ కమిటీ కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసిందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయాక కొద్దిపాటి మార్పులు, చేర్పులతో పాత ఆంధ్ర రాష్ట్రమే ఆంధ్రప్రదేశ్‌గా మిగిలిందని అన్నారు. రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా లేదా కేంద్రపాలిత ప్రాంతంగా చేసుకోవాలని రాయలసీమవాసులు ఎంతగానో శ్రమించారని అన్నారు. సీమవాసుల కళ్లలో నీరు ఇంకా ఎండలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ అభివృద్ధిని కాంక్షించి, ప్రత్యేక రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతంగా మార్చేలా ప్రధానిపై ఒత్తిడి తేవాలని కోరారు. కర్నూలుకు గురువారం వస్తున్న ప్రధానికి సీమ ప్రజా ప్రతినిధులు వినతిపత్రాలను సమర్పించాలని ఆయన సూచించారు.

# గాలిలో ప్రాణాలు..!



బస్సు టాపుపై ప్రయాణిస్తున్న విద్యార్థులు

టాపుపై ప్రయాణం నిషిద్ధమనీ, అపాయమనీ ఆర్టీసీ బస్సుల్లో ఎక్కడ చూసినా రాసి ఉంటారు. వాటి అమలు మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. బడిపిల్లలు, అదికూడా ఆడుకునే మనస్తత్వం ఉన్నవారు బస్సు టాపుపైకి ఎక్కుతుంటే వద్దని చెప్పేవారు కరువయ్యారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం.. సురక్షితం అని రాసుకునే అధికారులు.. పిల్లల ప్రాణాలను గాలిలో ఉంచుతున్నారు. బొమ్మనహాళ్ మండలంలోని బొల్లనగుడ్డం, కల్లుహోళ్ల గ్రామాల విద్యార్థులు గోవిందవాడ ఉన్నత పాఠశాలకు వెళ్తున్నారు. ఉదయం పాఠశాలకు, సాయంత్రం తిరుగు ప్రయాణంలో బస్సు కిక్కిరిసిపోతోంది. దీంతో విద్యార్థులు టాపుపైనే కూర్చుని వస్తున్నారు. బస్సు టాపుపై ఆడుకుంటూ, కేకలు వేసుకుంటూ, అటు ఇటు తిరుగుతున్నారు. ఏమాత్రం పట్టుతప్పినా ప్రాణాలకే ప్రమాదం. ఆర్టీసీ సిబ్బంది ఇవేవీ పట్టించుకోకుండా టాపు ఎక్కించేస్తున్నారు. అధికారులు మేల్కొని తక్షణమే అదనపు బస్సులు ఏర్పాటు చేసి, టాపు ప్రయాణాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– బొమ్మనహాళ్, ఆంధ్రజ్యోతి

# పర్యాటక అభివృద్ధికి కృషి చేయాలి


**కలెక్టర్ ఆనంద్**



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాలోని వివిధ పర్యాటక సంరక్షణ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై కలెక్టర్ సంబంధిత శాఖాధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో తాడిపత్రి, ఉరవకొండ, అనంతపురం, కసాపురం, గుత్తి కోట, పెన్నహోబిలం, పెనకచెర్ల, వజ్రకరూరు, గూగూడు, హంపాపురం తదితర పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి స్వచ్ఛంద సేవాసంస్థలు, వ్యక్తులు ముందుకు రావాలన్నారు. చెరువులు, నీటి వనరుల వద్ద బోటింగ్ సౌకర్యం కల్పించడం ద్వారా ప్రజలకు వినోదం, ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. అనంతపురంలో విశాల స్థలంలో ఉన్న శిల్పారామాన్ని అభివృద్ధి చేసి, స్థానిక కళాకారుల ఉత్పత్తులను ప్రదర్శించడానికి, విక్రయించడానికి ప్రత్యేక వేదికగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు, డ్వామా పీడీ సలీంబాషా, శిల్పారామం మేనేజర్ శివారెడ్డి, చరిత్ర ప్రొఫెసర్ సుధాకర్, ఆలిండియా రేడియో ప్రతినిధులు, ఇంటాక్ అధ్యక్షుడు రామ్‌కుమార్, గుత్తి కోట పరిరక్షణ సమితి అధ్యక్షులు విజయభాస్కర్‌చౌదరి, పురావస్తు శాఖ మ్యూజియం అధికారులు పాల్గొన్నారు.

# పీఏబీఆర్ @ 5.3 టీఎంసీలు



డ్యాం గేట్ల వద్దకు చేరిన నీరు

కూడేరు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్)లో నీటి నిల్వ 5 టీఎంసీలు దాటింది. ప్రస్తుతం డ్యాంలో నీటి నిల్వ 5.3 టీఎంసీలకు చేరింది. టర్బైన్‌లో సమస్య తలెత్తడంతో ఆరు రోజులుగా జల విద్యుదుత్పత్తిని ఆపేశారు. దీంతో హెచ్చెల్సీ నీటిని పీఏబీఆర్‌కు రాకుండా నేరుగా ఎంపీఆర్‌కు మళ్లించారు. టర్బైన్ మరమ్మత్తుల అనంతరం రెండ్రోజుల్లో ఉత్పత్తి పునఃప్రారంభించనున్నట్లు జెన్‌కో ఈఈ వెంకటరామ కృష్ణయ్య తెలిపారు. ప్రస్తుతం జీడిపల్లి రిజర్వాయర్ నుంచి మాత్రమే 380 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌లోకి వచ్చి చేరుతోంది. జల విద్యుదుత్పత్తి తిరిగి ప్రారంభిస్తే హెచ్చెల్సీ నీటిని పీఏబీఆర్‌కు వదలనున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 11 టీఎంసీలు కాగా, 5 నుంచి 6 టీఎంసీలలోపే నిల్వ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 443 అడుగులు కాగా, ప్రస్తుతం 435 అడుగులు ఉన్నట్లు వారు తెలిపారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వ 5 టీఎంసీలు దాటడంతో జలకళను సంతరించుకుంది. పర్యాటకుల సందడి పెరిగింది.

## విద్యుత్ శాఖ ఉద్యోగుల సమ్మె వాయిదా

అనంతపురం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు ఉద్యోగుల సమ్మె వాయిదా పడింది. మంగళవారం రాత్రి ప్రభుత్వంతో రాష్ట్ర విద్యుత్తు జేఏసీ నాయకులు చర్చలు జరిగినట్లు జిల్లా నేతలు అంటున్నారు. డిమాండ్లపై ఏకాభిప్రాయం కుదరనట్లు తెలుస్తోంది. ప్రధాన మంత్రి కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో రాష్ట్ర నాయకులు సమ్మెను వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఈనెల 17న తిరిగి రాష్ట్ర జేఏసీ నాయకులు.. ప్రభుత్వంతో చర్చలు జరపనున్నట్లు జిల్లా నేతలు తెలిపారు. ఆ మేరకు తదుపరి కార్యాచరణ చేపడతామన్నారు.

## రెండో విడతలో 52 మందికి ప్రవేశాలు

అనంతపురం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో రెండో విడత పీజీ అడ్మిషన్లలో మొత్తం 52 మంది ప్రవేశాలు పొందినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మూడురోజులపాటు సాగిన ఈ ప్రక్రియ బుధవారం ముగిసింది.

## టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో బుధవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.10, సరసరిగా రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,100 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.